తెలంగాణ రాష్ట్రం అక్కర్లేదు!

- సమైక్య రాష్ట్రమే బాగుండేది: రేవంత్
- వలసపాలకులు నీళ్లు ఇచ్చిండ్రు.. నిధులు ఇచ్చిండ్రు.. ఉద్యోగాలిచ్చిండ్రు
- అది ఉద్యమ నినాదం కాదు.. బీఆర్ఎస్ పార్టీ నినాదం.. టీపీసీసీ చీఫ్ రేవంత్ వాచాలత

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఇది చీకటి రోజు.. వేలమంది ఆత్మబలిదానాలను దారుణంగా అవమానించిన రోజు.. అమరవీరుల ఆత్మలు ఘోషిస్తున్న దుర్దినం. మూడు కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆశ, శ్వాస, ఆకాంక్షను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా గాయపర్చిన రోజు.. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్ని హద్దులు దాటేశారు. ఉద్యమ సమయంలో సమైక్యవాదుల సంకలో జొర్రి తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీ ఎక్కువ పెట్టిన ఆయన.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 10 ఏండ్ల తర్వాత కూడా తన బుద్ధి మారలేదని నిరూపించుకొన్నారు. ప్రధాని మోదీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విధానాన్ని ప్రశ్నిస్తే.. రేవంత్ ఏకంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటునే ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటుచేయాల్సిన అవసరమే లేకుండెనని ప్రకటించారు. మొన్నటికి మొన్న టెక్నికల్‌గా తెలంగాణ రాష్ట్రం ఇవ్వాల్సిన అవసరం లేదని ప్రకటించిన ఆయన.. శుక్రవారం తన ముసుగును మొత్తం తీసేశారు. ఓ టీవీ చానల్‌లో మాట్లాడిన రేవంత్ గొంతులో నుంచి సమైక్యవాదుల భాష స్పష్టంగా బయటకు వచ్చింది.

భగభగ మండిన ఉద్యమానికి చెద అంటించే ప్రయత్నం

తెలంగాణ ఉద్యమ ట్యాగ్‌లైన్ ఏంటని రాష్ట్రంలో ఎవరిని అడిగినా టక్కున చెప్పేస్తారు 'నీళ్లు, నిధులు, నియామకాలు' అని. కానీ, రేవంత్‌రెడ్డి మాత్రం అవి అసలు విషయమే కాదని తేల్చేశారు. సమైక్య పాలకులు ఏనాడో తెలంగాణకు నీళ్లు, నిధులు ఇచ్చారు, నియామకాలు జరిపారని సెలవిచ్చారు. 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనేది కేవలం టీఆర్ఎస్ (బీఆర్ఎస్) రాజకీయ ఎజెండా మాత్ర మేనని భాష్యం చెప్పారు. తెలంగాణ ప్రజలు ఎన్నడూ నీళ్ల గురించి కానీ, నిధుల గురించి కానీ, నియామకాల గురించి కానీ ఆలోచించ నేలేదని చెప్పుకొచ్చారు. సమైక్యవాదుల పాలన అద్భుతమని, తెలంగాణకు వారు అన్నీ ఇచ్చారనేలా మాట్లాడారు. ఈ మాటలు తెలంగాణ ఉద్యమాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన సమైక్యవాదులు కూడా ఇప్పటివరకు ఎవరూ అనలేదు. కలిసి ఉందాం అన్నారేగాని.. తెలంగాణకు గొప్పగా సేవలు చేశామని చెప్పలేదు. మొదటిసారి రేవంత్‌రెడ్డి తెలంగాణలో సమైక్య పాలన అద్భుతంగా సాగిందని చెప్పారు. తెలంగాణ కోసం అనేక భారీ ప్రాజెక్టులు కట్టారని, హైదరాబాద్ అభివృద్ధికి లెక్కలేనన్ని నిధులు ఇచ్చారని, ఖాళీలు కనిపించకుండా ఉద్యోగాలు భర్తీ చేశారని సెలవిచ్చారు.

మరి ఉద్యమం ఎందుకొచ్చినట్టు?

మరి తెలంగాణ ఉద్యమం ఎందుకు వచ్చిందో రేవంత్‌రెడ్డి ఇప్పుడు తెలంగాణ ప్రజలకు చెప్పి తీరాలి. వందల మంది తెలంగాణ యువకులు ఎందుకు ఆత్మబలిదానాలు చేశారో చెప్పి తీరాలి. 1956 నుంచే తెలంగాణలో ఏదో ఒకచోట తెలంగాణ ఉద్యమం ఎగిసి పడని సందర్భం లేదు. మరి సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు పుష్కలమైన నీళ్లు అందితే, కావాల్సినన్ని నిధులు లభిస్తే, తెలంగాణ ప్రాంత ఉద్యోగాలు ఇక్కడివారితోనే భర్తీ అయితే.. 50 ఏండ్లపాటు ఉద్యమం అలుపెరుగకుండా ఎందుకు సాగిందో రేవంత్ చెప్పి తీరాలి. సమైక్య పాలకులు తెలంగాణలో పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టి పుష్కలంగా నీళ్లు ఇస్తే.. పాలమూరు నుంచి లక్షలమంది గోడుగోడున ఏడుస్తూ బతడానికి బొంబాయి ఎందుకు పోయేవారో రేవంత్ చెప్పి తీరాలి. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ మొత్తాన్ని కరువు ప్రాంతంగా కేంద్రం ఎందుకు ప్రకటించిందో చెప్పి తీరాలి. సమైక్య రాష్ట్ర సచివాలయంలో 90 శాతం ఉద్యోగులు ఆంధ్రావారే ఎందుకు ఉండేవారో చెప్పి తీరాలి. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిన ప్రతిసారీ కేంద్ర ప్రభుత్వాలు కమిటీల మీద కమిటీలు వేసి లెక్కలు తేల్చేవి. ఆ కమిటీలన్నీ వేసింది నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలే. మరి తెలంగాణకు సమైక్య పాలకులు అన్నీ ఇస్తే.. ఆ కమిటీలు వేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో రేవంత్ చెప్పి తీరాలి. మిగులు రాష్ట్రమైన హైదరాబాద్‌ను ఆంధ్రతో కలిసిన ప్పుడు.. లోటు రాష్ట్రమైన ఆంధ్ర పాలకులు సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు నిధులు 'బాగానే' ఇచ్చారని చెప్తున్న రేవంత్‌రెడ్డి.. ఆ నిధులు ఎక్కడి నుంచి తెచ్చారో చెప్పి తీరాలి అని తెలంగాణవాదులు ప్రశ్నిస్తున్నారు.

ఆ ప్రాజెక్టులు ఎవరికోసం కట్టారు?

నాగార్జునసాగర్, శ్రీశైలం, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులు సమైక్యపాలకులే నిర్మించారని రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. మరి వాటివల్ల లాభపడింది ఎవరు? నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని కుట్రతో మార్చి నిర్మించి అత్యధిక భాగం నీళ్ల సమైక్య పాలకుల ప్రాంతానికి తరలించుకుపోయారు. అక్రమంగా నీళ్లు తరలించుకుపోయేందుకే శ్రీశైలం ప్రాజెక్టును వాడుకున్నారు తప్ప.. ఏనాడూ అక్కడ సరిగా కరెంటు ఉత్పత్తి చేసి తెలంగాణకు ఇవ్వలేదు. కోయిల్‌సాగర్, నెట్టెంపాడు పరిస్థితీ అంతే.. తెలంగాణలో ఏ ప్రాజెక్టు మొదలుపెట్టినా పూర్తిచేసిన పాపాన పోలేదు. వాళ్లు వదిలేసి వెళ్లిన ప్రాజెక్టులన్నీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వమే పూర్తిచేసింది. రేవంత్‌రెడ్డికి మాత్రం సమైక్యవాదుల పాలనే అద్భుతంగా కనిపిస్తున్నది.

అది 60 ఏండ్ల ట్యాగ్‌లైన్

ప్రపంచం దృష్టిని ఆకర్షించిన ప్రతి ఉద్యమానికి ఒక ట్యాగ్‌లైన్ ఉన్నది. అది ఆ ఉద్యమపు అంతిమ లక్ష్యమై ఉంటుంది. దాని సాధనకోసమే అలుపెరగని పోరాటాలు జరుగుతూ ఉంటాయి. తెలంగాణ ఉద్యమానికీ ట్యాగ్‌లైన్ ఉన్నది. అదే 'నీళ్లు, నిధులు, నియామకాలు'. ఇది ఒక రాజకీయ పార్టీ సృష్టించిన నినాదం కాదు. తెలంగాణ ఉద్యమంలో నుంచి అగ్నిపర్వతం బద్దలైనంత భీకరంగా ఉద్యమకారుల నోటి వెంట వచ్చిన పాలికేక. ఏనాడైతే సీమాంధ్రతో హైదరాబాద్ రాష్ట్రాన్ని కలిపారో.. ఆనాడే ఈ నినాదం పుట్టుకొచ్చింది. కేసీఆర్ టీఆర్ఎస్‌ను ప్రారంభించకముందునుంచే ఈ నినాదం తెలంగాణ నలుమూలల ప్రతిధ్వనించింది. ప్రొఫెసర్ జయశంకర్ కాలికి బలపం కట్టుకొని తెలంగాణ మూల మూలనా తిరుగుతూ ప్రజలకు ఉద్బోధించింది. ఈ నినాదాన్నే టీఆర్ఎస్, కేసీఆర్ మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లి ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు స్వయంగా ఆయన పుట్టుకపై కూడా అనుమానాలు కలిగేలా ఉన్నాయని ఉద్యమకారులు అంటున్నారు. ఉద్యమంపై కనీసం జ్ఞానం కూడా లేదంటే.. ఆయన పరిస్థితి ఏమిటో అర్థమవుతుందని విమర్శిస్తున్నారు.

మోదీని మించిన ద్వేషం

ప్రధాని మోదీ కూడా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు గురించి పలుమార్లు అవమానించేలా మాట్లాడారు. కానీ, ఆయన రాష్ట్ర ఏర్పాటు విధానం సరిగ్గా సాగలేదనే చెప్పారు. రేవంత్ మాత్రం అసలు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుచేయాల్సిన అవసరమే లేదని తేల్చి చెప్పారు. ఇది తెలంగాణ సమాజానికి శరాఘాతమే. కనీసం తాను తెలంగాణ వాసిగా ఆలోచించినా ఇలాంటి వ్యాఖ్యలు చేసేవాడు కాదేమోని ఉద్యమకారులు అంటున్నారు. తన జీవితం, ఆలోచనలన్నీ సమైక్యవాదుల భిక్ష అనేలాగా వ్యాఖ్యానించడం ఆయన బానిస బతుక్కు ఉదాహరణ అని మండిపడుతున్నారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ టీడీపీ పోటీ చేయకపోవడం, వైఎస్సార్టీపీ అధ్యక్షురాలు షర్మిల పోటీ చేయకుండా కాంగ్రెస్ పార్టీకి మద్దత్తుగా నిలవడం వెనుక వలసపాలకుల ఆలోచనలను అమలు చేస్తున్నట్టుగా తెలంగాణ ప్రజలు అర్థం చేసుకున్నారు. తాజాగా రేవంత్ వ్యాఖ్యలు సమైక్యవాదుల ప్రణాళికను బహిర్గతం చేశాయి. అందరూ అనుమానిస్తున్నట్టుగానే తాను కాంగ్రెస్‌లో చేరడం.. పీసీసీ అధ్యక్షుడు కావడం.. అభ్యర్థుల ఎంపికలో అదేస్థాయిలో వ్యవహరించడం.. చివరకు ఉద్యమ ట్యాగ్‌లైన్ ఉనికినే ప్రశ్నించటం.. వీటన్నింటినీ కలిపి చూస్తే.. సమైక్యవాదులతో కలిసి రేవంత్ మాస్టర్ ప్లానే వేసినట్టు అర్థమవుతుందని తెలంగాణవాదులు పేర్కొంటున్నారు. తన గురువు చంద్రబాబు ఆలోచనలను తెలంగాణలో ఆచరణలో పెట్టడానికే పీసీసీ పదవి దక్కించుకొని స్వరాష్ట్ర వ్యతిరేక కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు.

తెలంగాణ ద్రోహి రేవంత్

రేవంత్ ఇలా మాట్లాడటం దుర్మార్గం. సమైక్యవాదుల అడుగులకు మడుగులొత్తిన ఉద్యమ ద్రోహి. తెలంగాణ ప్రజలన్నా..ప్రజల ఆకాంక్షలన్నా ఆయనకు గిట్టదు. స్వరాష్ట్రం కోసం సబ్బండవర్గాలు తండ్లాడినయ్. తెలంగాణ పోరాటాన్ని, తెలంగాణ అస్తిత్వాన్ని రేవంత్ దారుణంగా దెబ్బతీశాడు. తెలంగాణ ఉద్యమాన్ని, ఉద్యమకారులను అవమానించాడు. ప్రజ లు ఇలాంటి కుట్రలను చేదించాలి. రేవంత్‌రెడ్డి వంటి కుట్రదారులను ఓడించాలి.

– జీ దేవిప్రసాద్,
టీఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు

బూట్లు నాకినోడికేం తెలుస్తుంది?

తెలంగాణ ఉద్యమ ట్యాగ్‌లైనే నీళ్లు, నిధు లు, నియామకాలు. ఇ ది తెలియకుండా సమైక్య పాలకుల బూట్లు నాకినోళ్లకు తెలంగాణ నినాదాలేం తెలుస్తాయి? 610 జీవో సాధన ఉద్యోగాల కోసం కాదా? పదోన్నతులు రాక, ఆంధ్రా ఉద్యోగులకే పట్టం కడితేనే 48:52 నిష్పత్తి ఫెయిర్ షేర్ కోసం పోరాడింది నిజం కాదా? 2011 తర్వాత జరిగిన ఉద్యమమే ఫ్రీ జోన్‌కు వ్యతిరేక పోరాటం. ఇదే తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమంగా ఎగిసిపడి స్వరాష్ట్ర స్వప్నాన్ని నిజం చేసింది. ఉద్యమకారులంతా రేవంత్‌రెడ్డిని తరిమికొట్టే సమయం ఆసన్నమైంది.

–మామిళ్ల రాజేందర్,
టీఎన్జీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు.

ఇప్పటికీ రేవంత్ సమైక్యవాదే

రేవంత్‌రెడ్డి విచక్షణ కోల్పోయాడు. రేవంత్ ఏనాడూ ఉద్యమంలో పాల్గొనలేదు. కాబట్టే ఉద్యమం ఎందుకు జరిగిందని ఎట్లా తెలుస్తుంది? ఉద్యమకాలంలో రేవంత్‌రెడ్డి సమైక్యవాదిగానే ఉన్నాడు. ఇప్పటికీ సమైక్యవాదిగానే మాట్లాడుతున్నడు. నీళ్ల అప్పుడే ఇచ్చి ఉంటే మరి అనాడు తెలంగాణ ఎందుకు పచ్చగలే దు?ఈ పంటలు ఎందుకు పండలేదు? నిధులు ఇచ్చి ఉంటే ప్రాజెక్టులు ఎందుకు కట్టలేదు? రేవంత్ వ్యాఖ్యలు సిగ్గుచేటు.

–మల్లేపల్లి లక్ష్మయ్య,
బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేకాధికారి

కరెంట్ 3 గంటలే చాలు

మొదటిపేజీ తరువాయి...

చేసిన వ్యాఖ్యలు. కరెంట్‌పై రేవంత్‌రెడ్డి మళ్లీ అవే విషపు వ్యాఖ్యలు.. అవే కుట్రలు చేస్తున్నారు. వ్యవసాయానికి 3 గంటలు ఇస్తే సరిపోతుందని మూడు నెలల క్రితం అమెరికాలో తన కుట్ర కోణాన్ని బయటపెట్టిన ఆయన, తాజాగా మరోసారి అవే వ్యాఖ్యలు చేశారు. ఒకసారి అంటే పొరపాటున అన్నారేమో అనుకోవచ్చు, కానీ అదే మాట మళ్లీ అంటే అది పొరపాటు కాదు.. కుట్ర అనేది స్పష్టమైంది. శుక్రవారం ఓ టీవీ చానల్ చర్చలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి, వ్యవసాయానికి 3 గంటల కరెంట్ సరిపోతుందని తేల్చి చెప్పేశారు. గత జూలై 10న అమెరికాలో జరిగిన తానా సభల్లో పాల్గొన్న ఆయన తెలంగాణలో వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలని చెప్పిన విషయం తెలిసిందే. ఆ సమయంలో రేవంత్‌పై రాష్ట్ర రైతాంగ మంతా ఆగ్రహం వ్యక్తంచేయటంతో కాంగ్రెస్ పార్టీ నేతలు తమ నాయకుడి మాటలను వక్రీకరించారని బుకాయించే ప్రయత్నం చేశారు. కానీ, రేవంత్ మళ్లీ అదే మాట మాట్లాడి.. తాను అమెరికాలో సోయిలో ఉండే ఆ మాటలు అన్నట్టు తేటతెల్లం చేశారు.

కరెంట్‌పై కాంగ్రెస్ కుట్ర

ఉమ్మడి రాష్ట్రంలో రైతులు, ప్రజలు పడ్డ కరెంట్ కష్టాలను స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ రూపుమాపారు. అప్పుడు కరెంట్ ఉంటే వార్త అయితే.. ఇప్పుడు కరెంట్ పోతే వార్త అనే పరిస్థితికి తీసుకొచ్చారు. రాష్ట్రంలో పారిశ్రామిక, వ్యవసాయరంగాలు అభివృద్ధి బాట పట్టాయి. రైతుల కష్టాలు తీరాయి. రాష్ట్రంలో మళ్లీ కరెంట్ కష్టాలు తెచ్చేందుకు కుట్ర చేస్తున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రాన్ని కర్ణాటక బాటలో నడిపేందుకు కుట్ర చేస్తున్నదని మండిపడుతున్నారు. కర్ణాటకలో రైతులకు 7 గంటలు కరెంట్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు ఐదు గంటలు కూడా ఇవ్వడం లేదని ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్వయంగా ఒప్పుకున్నారు. ఇప్పుడు ఇదే విధానాన్ని తెలంగాణలో అమలు చేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రేవంత్ వ్యాఖ్యలపై భగ్గుమన్న రైతులోకం

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై తెలంగాణ రైతాంగం భగ్గుమంటున్నది. తమను నాశనం చేసేందుకు రేవంత్ కంకణం కట్టుకున్నాడని రైతులు మండిపడుతున్నారు. ఉమ్మడి పాలనతో తమను గోస పెట్టిన కాంగ్రెస్ పార్టీకి ప్రత్యేక రాష్ట్రంలోనూ పగ చల్లారలేదా అని నిలదీస్తున్నారు. ఎద్దు ఎవుసం తెలియని రేవంత్‌రెడ్డికి ఉమ్మడి రాష్ట్రంలో తాము పడ్డ కరెంట్ కష్టాలు ఏం తెలుసని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గంటలో ఎకరం భూమి ఎట్ల పారిస్తడో చెప్పాలంటే నిలదీస్తున్నారు. మూడు గంటల కరెంట్‌తో ఏం పండిస్తడో చేసి చూపాలంటూ ప్రశ్నిస్తున్నారు. మూడు గంటల కరెంట్ తమ ఎండ్ల పెయ్యి కడిగేందుకు కూడా సరిపోదని, ఇక పంటలేలా పండించాలంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెస్‌కు రాష్ట్రంలో పుట్టగతులుండవని హెచ్చరిస్తున్నారు.

ఆ 'చేతి'లోకి వెళితే తెలంగాణ ఉంటుందా?

ఇంతటి విషం కక్కుతున్న రేవంత్‌రెడ్డి చేతిలోకి వెళితే తెలంగాణ అస్థిత్వం ఉంటుందా? అనే అనుమానాలు బలపడుతున్నాయి. వలస పాలకులతో అంటకాగుతున్న రేవంత్ చేతిలో తెలంగాణను పెడితే.. తిరిగి వలస పాలకుల ఆధిపత్యంలోకి వెళ్లడమేనని ఆందోళన వ్యక్తమవుతున్నది. తలెత్తుకుని బతుకుతున్న తెలంగాణ ప్రజలు మరోసారి బానిసలుగా బతకాల్సిన అగత్యం ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయినా ఇప్పటికీ రెండు రాష్ట్రాల మధ్య నీళ్ల విషయంలో పంచాయతీలు పూర్తిగా పరిష్కారం కాలేదు. కృష్ణా నీటిలో మనవాటా మనకు దక్కలేదు. ఈ పరిస్థితుల్లో రేవంత్ చేతిలోకి తెలంగాణ వెళ్తే.. ఆయన గురువులైన సమైక్యవాదులు ఏది అడిగితే అది రాసిస్తాడని తెలంగాణవాదులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడితే మళ్లీ కరువులు, కష్టాలు తప్పవని అంటున్నారు.

పదేండ్లకు యాదొచ్చిందా?

మోదీ.. లైంగికదాడులపై చర్యలేవి?

పరేడ్ గ్రౌండ్ సభలో లైట్ల స్టాండ్ ఎక్కి ప్రధానిని నిలదీసిన యువతి

మాదిగల విశ్వరూప సభలో ప్రధాని మోదీకి ఊహించని షాక్ తగిలింది. ప్రధాని మోదీ మాట్లాడుతుండగా ఓ యువతి విద్యుత్తు లైట్ల స్టాండ్‌ను ఎక్కి మరీ నిరసన తెలిపింది. రోజుకో లైంగికదాడి జరుగుతున్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని, ఒకే మతాన్ని ఎందుకు ప్రోత్సహిస్తున్నారని, కులాల పేరుతో ఎందుకు రెచ్చగొడుతున్నారని, ఎస్సీ వర్గీకరణ చేయవద్దని నినదించింది. ఊహించని హఠాత్పరిణామానికి మోదీ ఖంగుతిన్నారు. కరెంట్ స్టాండ్ దిగాలని యువతిని కోరారు.

మొదటిపేజీ తరువాయి...

మాదిగలను వంచించే ప్రయత్నం చేశారు. ఎస్సీ వర్గీకరణకు త్వరలోనే కమిటీ వేస్తామని మాటల గారడీతో బురిడీ కొట్టించారు. ప్రధాని తీరుపై మాదిగ సంఘాల నేతలు, మేధావులు దుమ్మెత్తిపోస్తున్నారు. మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభను హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం సాయంత్రం మంద కృష్ణ నేతృత్వంలో నిర్వహించగా, ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సభ నిర్వహణకు ముందునుంచీ ఎస్సీ వర్గీకరణపై కీలకమైన ప్రకటన చేస్తారని బీజేపీ నేతలు ఊదరగొట్టగా, మోదీ మాత్రం యథావిధిగా మళ్లీ మాటలతో వంచించి పోయారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏండ్లుగా మాదిగలు పోరాడుతున్నారని, ఎంతో మంది ప్రాణాలను కోల్పోయారంటూ మొసలి కన్నీరు కార్చారు. వాస్తవానికి 2014 సాధారణ ఎన్నికల సందర్భంగానే తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపడతామని మోదీనే స్వయంగా హామీ ఇచ్చారు. బీజేపీ మ్యానిఫెస్టోలోనూ ఈ అంశాన్ని చేర్చారు. కానీ అధికారం చేపట్టి 3,455 రోజులు గడిచినా ఎస్సీ వర్గీకరణపై ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మళ్లీ ఇప్పుడు ఎస్సీ వర్గీకరణ పోరాటంపై కపటప్రేమ ఒలకపోయడంపై మాదిగ మేధావివర్గం మండుతున్నది. మాదిగల పోరాటంపై అంత చిత్తశుద్ధి ఉంటే అధికారంలో ఉన్న తొమ్మిదిన్నరేండ్లుగా వర్గీకరణ అంశాన్ని ఎందుకు ప్రస్తావించలేదు? పరిష్కారం చూపే ప్రయత్నం ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తున్నారు.

కమిటీ పేరిట మళ్లీ కాలయాపనే..!

విశ్వరూప సభలో ప్రధాని మోదీ చేసిన ప్రకటన ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పరిష్కరించాలనే చిత్తశుద్ధి బీజేపీ ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని స్పష్టంగా తేలిపోయింది. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెడతామని హామీ ఇవ్వకుండా వర్గీకరణ అంశంపై త్వరలోనే కమిటీ వేస్తామని ప్రకటించడంలోనే మాదిగలను వంచించాలనే బీజేపీ కుట్ర దాగి ఉన్నదని నిపుణులు అంటున్నారు. ఇదే అభిప్రాయాన్ని మాదిగ మేధావివర్గం కూడా వ్యక్తపరుస్తున్నది. జనాభాపరంగా మాలలకన్నా మాదిగల సంఖ్య ఎక్కువైయినప్పటికీ, విద్య, ఉద్యోగావకాశాల్లో మాదిగలు చాలా తక్కువ స్థాయిలో ఉండటమే వర్గీకరణ ఉద్యమానికి మూలం. మాదిగల పోరాటంతో ఈ అంశంపై 1995లో అప్పటి ప్రభుత్వం జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను నియమించింది. మాదిగల వాదన నిజమేనని ఆ కమిషన్ నివేదికను సమర్పించగా, దాని ఆధారంగా 1997లో ఆనాటి తెలుగుదేశం (ఎన్డీఏ భాగస్వామ్యం) ప్రభుత్వం 15 శాతం ఎస్సీ కోటాను ఏ, బీ, సీ, డీగా విభజించింది. 2000 సంవత్సరంలో రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ అనే చట్టం చేసింది. రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ ఆమోదంతో అది అమల్లోకి వచ్చింది. అయితే ఎస్సీ కులాల జాబితాలో జోక్యం, పునర్‌వర్గీకరణ వంటివి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేదని 2004 నవంబర్‌లో సుప్రీంకోర్టు దాన్ని కొట్టివేసింది. దీంతో వర్గీకరణ పంచాయితీ మళ్లీ మొదటికి వచ్చింది. మళ్లీ ఒత్తిళ్లు పెరగడంతో 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రాజ్యాంగ సవరణ కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయగా, దానికి ప్రతిస్పందనగా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఉషా మెహ్రా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 2008 మేలో అప్పటి మంత్రి మీరాకుమార్‌కు కమిషన్ తన నివేదికను సమర్పించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341ని సవరించాలని, ఆ ఆర్టికల్‌లో 3వ క్లాజును చేర్చడం ద్వారా, రాష్ట్ర అసెంబ్లీలు ఏకగ్రీవ తీర్మానం చేసిన పక్షంలో కులాల వర్గీకరణను పార్లమెంటు ఆమోదించవచ్చని కమిషన్ సిఫారసు చేసింది. కానీ కేంద్రంలోని కాంగ్రెస్ దానిని పట్టించుకోలేదు. 2014 ఎన్నికల ప్పుడు తాము అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రకటించిన మోదీ, బీజేపీ నేతలు ఇప్పటికీ దానిని పట్టించుకోలేదు. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వర్గీకరణ అంశంపై తీర్మానం చేసి కేంద్రానికి పంపినా ఇప్పటికీ అది స్పందించలేదు. విశ్వరూప సభలో ఆ దిశగా సానుకూల నిర్ణయం వస్తుందని మాదిగలు ఆశించినా అడియాసే అయ్యింది. ఓట్ల కోసం తప్ప మోదీ ప్రకటనలో మరేమీలేదని విశ్లేషకులు అంటున్నారు.

ఎస్సీలకు ప్రత్యేకంగా ఏం చేశారు..?

సభలో వర్గీకరణ అంశమేగాకుండా ఎస్సీ సంక్షేమంపైనా ప్రధాని అడ్డగోలుగా మాట్లాడారని మాదిగ మేధావులు నిప్పులు చెరుగుతున్నారు. ఉచిత రేషన్ బియ్యం, గ్యాస్ కనెక్షన్లు ఇస్తున్నామని, టాయిలెట్లు కట్టిస్తున్నామని, ఎస్సీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామని ప్రకటించడంపై మండిపడుతున్నారు. అవి మాదిగలకు మాత్రమే ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. దేశంలోని పేదలందరికీ ఇస్తున్నారు తప్ప ప్రత్యేకంగా ఏమీ లేదని ధ్వజమెత్తుతున్నారు. బీజేపీ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో మాదిగలకు చేసిన ఒక్క మంచి పనీ లేదని విమర్శిస్తున్నారు. విశ్వకర్మ యోజన కింద కుల వృత్తిదారులకు రుణం రూపంలోనే ఆర్థిక సాయం అందిస్తున్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం దళితులకు 100 శాతం సబ్సిడీతో రూ.10 లక్షలను అందిస్తున్న దళితబంధును విమర్శించడం సిగ్గుచేటని దళిత మేధావి వర్గం దుయ్యబడుతున్నది. ప్రధాని వస్తున్నారంటే ఏదో ఊహించుకున్నామని, కానీ మోదీ చెప్పింది, చేసింది ఏమీ లేదని విమర్శించారు.

తెలంగాణలో అంబేద్కర్‌కు అందలం

తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అంబేద్కర్ ఆలోచనా విధానాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నది. అందుకు దళితబంధు పథకమే నిదర్శనం. హైదరాబాద్ నడిబొడ్డున ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన అంబేద్కర్ విగ్రహాన్ని 125 అడుగుల ఎత్తులో నిర్మించింది. కొత్తగా నిర్మించిన రాష్ట్ర సచివాలయానికి కూడా ఆయన పేరే పెట్టి గొప్పగా గౌరవించింది. అంబేద్కర్‌కు భారతరత్న ఇప్పించామని, ఆయన ఫొటోను పార్లమెంటులో పెట్టామని గొప్పగా చెప్పుకొన్న ప్రధాని.. కొత్త పార్లమెంటు భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలన్న డిమాండ్లను మాత్రం కనీసం పట్టించుకోలేదు. నిజానికి 1990లో వీపీ సింగ్ ప్రభుత్వం ఉన్నప్పుడే అంబేద్కర్‌కు భారతరత్న ఇచ్చారు. అదే సందర్భంలో పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటుచేశారు. ఇందులో మోదీ చెప్పుకొనేంత గొప్పలు ఏమున్నాయని దళిత సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

నా తల్లి(తెలంగాణ)ని కొనాలని చూసిండు

- 500 కోట్లు ఇచ్చినా అమ్మబోనని రేవంత్‌కు చెప్పిన
- నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): 'పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆనాడు మా అమ్మ (తెలంగాణ)ను కొనడానికి మా ఇంటికి వచ్చాడు' అని నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ చెప్పారు. 'ఐదు కోట్లు ఇస్తాం, మీ అమ్మ (తెలంగాణ)ను అమ్ము అని అన్నాడు. 500 కోట్లు ఇచ్చినా అమ్మను అమ్మ బోనని స్పష్టంగా చెప్పాను' అని తెలిపారు. స్టీఫెన్‌సన్ ఒక మీడియా సంస్థతో మాట్లాడుతూ.. 'ఎవరైనా అమ్మను అమ్ముతారా? మీరే చెప్పండి' అని ప్రశ్నించారు. మన తల్లి (తెలంగాణ)ని కాపాడుకోవాలి అని ఆయన రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ వచ్చినంక తమ బాధలు తీరాయని చెప్పారు. రాష్ట్రాన్ని నాశనం చేయాలని చాలా ప్రయత్నాలు జరిగాయని అన్నారు. తల్లిని కొనేటోళ్లు రాష్ట్రానికి ఏమీ చేయలేరని, వారికి పైసలే ముఖ్యమని చెప్పారు. తెలంగాణ వచ్చాక క్రైస్తవులకు ఎంతో మేలు జరిగిందని, రెసిడెన్షియల్ స్కూ